

చెహోవ్ కథ




# పెళ్లీ - పెడాకులూ

రష్యన్‌మూలం: చెహోవ్
తెలుగు గొంతు: కరుణారుణ

ఇల్లంతా పెళ్లి హడావిడి. ఇరవైమూడు మంది భోజనాలకూర్చున్నారు. అందులో ఎనిమిదిమంది 'ఒంట్లో బాగోలేదు' అంటూ ఏమీ తినరు. అద్దెకు తెచ్చుకున్న లైట్లు, వంట సామాను. ఎలక్ట్రిక్ బల్బుల కాంతికి కళ్లు మూసుకుపోతున్న ఒక టెలిగ్రాఫిస్టు శాస్త్ర ప్రగతిని శ్లాఘిస్తున్నాడు.

"ఎవడోగాని మనల్ని దోచుకోవటానికే ఈ ఎలక్ట్రిసిటీ కనిపెట్టారు. బొగ్గు కాలిస్తే ఎలక్ట్రిసిటీ పుడుతుందట. సహజమైన కాంతే కాంతి. ఇదేమి కాంతీ... లైటు కోసం కూడా పరిశోధనలా? హా, ఏం కాలం వచ్చింది. ..."

"నోరుంది గదాని ఏదో ఒకటి వాగితే సరా, సైన్సు గురించి నీకేం తెలుసనీ?..."

"నాకేం తెలియదయ్యా. మీరంతా పట్నవాసులు. జ్ఞానులు. మేం పల్లెటూరి బైతులం సరేనా. మనం కూర్చున్నది భోజనాలకా, నీ లెక్చరు వినటానికా, దా, గ్లాసులు ఖాళీగా వున్నాయి. కాసింత మందు పొయ్యి. నువ్వూ ఓ గుక్క వేసుకో."

"ఆహా, పెద్దవాళ్ల అజ్ఞకు తిరుగేముంది" అంటూ మాట కలుపుతాడు పెళ్లికొడుకు, అనవసర చర్చలెందుకు. సైన్సు తెలుసుకోవటం మంచిదే. కాని ప్రతిదానికీ ఓ సమయం వుంటుంది. ఏమంటావ్?" అంటూ పెళ్లికూతురి వైపు చూస్తాడు.

చురుకుతనం తప్ప అన్ని సుగుణాలూ వున్న పెళ్లికూతురు, "అర్థంకాని పద్ధతిలో మాట్లాడితే గొప్పనుకుంటారు" అంటుంది సిగ్గుపడుతూ.

"అక్కరకు రాని చదువెందుకూ. చదువులేకుండా మేం బతకలేదా, సంపాదించలేదా, సంసారాలు చెయ్యలేదా. మేం అంత అనాగకరికులమనుకుంటే, మా సంబంధం ఎందుకు ఇష్టపడ్డారు మరీ?" అంటూ దెప్పిపొడిచింది పెళ్లికూతురి తల్లి.

క్షణం నిశ్శబ్దం. సిగ్గుపడిన టెలిగ్రాఫిస్టుకు ఏం మాట్లాడాలో తెలియదు.

ఎలక్ట్రిసిటీ గురించి చేసిన ఒక్క వ్యాఖ్యానం ఇంత మందికి కోపం తెప్పిస్తుందనుకోలేదు. జల్సాగా గడపాల్సిన చోట అందరూ మూతి ముడుచుక్కూచున్నారు.

వాళ్లను సంతోష పెట్టడానికి, "అలా అనుకోవద్దు. మీరంటే మాకెంతో గౌరవం. ప్రేమ. ఎలక్ట్రిసిటీ సంగతి మరిచిపోదాం. రండి, గ్లాసు ఖాళీ చేద్దాం. ఈ రోజుల్లో మంచి పెళ్లికొడుకు దొరకటం ఎంత కష్టం! కేవలం డబ్బు కోసమే పెళ్లిళ్లు జరుగుతున్న ఈ రోజుల్లో మీ కూతురికి ఇలాంటి వరుడు దొరకటం అదృష్టం."

పెళ్లి కొడుక్కు కోపం వచ్చింది. "అంటే?"

"అబ్బే, నేను నీ గురించి మాట్లాడలేదు. లోకరీతి ఎలా వుందో చెప్పాను, అంతే."

"అంతే గింతే అని మాట మార్చకు. పెళ్లికొడుక్కు మేమేం తక్కువ చేశామని. వెయ్యి రూబుళ్లు నికరంగా ఇచ్చాము. ఇంకా మూడు కోట్లు, మంచం, వరువు, ఫర్నిచరూ, ఇంత పెట్టేవాళ్లు మీకెక్కడ దొరుకుతారు?" అంది పెళ్లికూతురి తల్లి. "ఎంత చేసినా తక్కువే ఈ గాడిదలకు" అన్న నిందార్థంలో.

"అబ్బే. నేను మీరు పెట్టలేదన్నానా! పెళ్లికొడుక్కు కోపం వచ్చినట్టుగా వుంటేనూ..."

"కోపం దేనికీ? పెళ్లి పెద్దవనుకోని నిన్ను పిలిచాం. పెద్దమనిషిలాగ మాట్లాడు. అకారణంగా కోపం ఎందుకు రావాలి ఎవరికైనా? పెళ్లి కొడుకు డబ్బులకాశపడుతున్నాడన్న విషయం నీకు ముందే తెలుసు గదా. మరి మాకెందుకు చెవ్వలేదూ? మాలాంటి అమాయకుల్ని మోసం చేసిన వాళ్లు..." అంటూ పెళ్లికూతురి తల్లి శాపనార్థాల్ని మధ్యలో ఆపి, కన్నీళ్లతో.

"నా బంగారుకొండ. నా వగడాల బొమ్మ. చివరికి దీన్ని డబ్బుకాశించిన...."

"చాల్చాలు. ఆహా... ఏం మర్యాద. ఎంత గౌరవం. చివరికి నేను మీకు డబ్బు మనిషిలా కనిపిస్తున్నానన్నమాట?" అంటూ టెలిగ్రాఫిస్టు వైపు తిరిగి,

"ఏం పెద్దమనిషివయ్యా. వీళ్లు ఇలాంటి మనుషులని తెలిసీ నాకెందుకు చెవ్వలేదు. ఛ. తప్పంతా నీదే. గెటవుట్" అంటూ అరిచాడు.

"నోరు పారేసుకోకు".

"నోరు కాదు. నిన్నే పారేస్తాను. ఈ రభసక్కారణం నువ్వు. గెటవుట్".

"కాస్త కంట్రోల్ చేసుకో.. తిట్టుకోవటానికిది సమయం కాదు" అంటూ శాంతించ ప్రయత్నిస్తారు పెళ్లికొడుకు ఫ్రెండ్సు.

"నో. అతడెవరివైపు మాట్లాడుతున్నాడో విన్నారా? నేను కేవలం అమ్మాయిని ఇష్టపడి చేసుకున్నాను. డబ్బుకోసం కాదు. ఏయ్, ఇంకా ఎందుకు్కూచున్నావ్, చెవుడా?" అంటూ టెలిగ్రాఫిస్టు మీద కోపం కక్కుతూనే వున్నాడు పెళ్లికొడుకు.

ఇంత చిన్నదానికే నీకింత కోపం వస్తుందనుకో లేదు. సరే. వెడతానులే. మొదట్ట మొన్న నేన్నీకిచ్చిన మూడు రూబుళ్లూ వాపసివ్వు... నువ్వు షోకులు చేసుకోవటానికి నా డబ్బులు కావాలీ".

పెళ్లికొడుకు ఫ్రెండ్సు వైపు చూస్తాడు. అందరూ తమ జేబులు వెదికి, చిల్లర పోగుచేసి మూడు రూబుళ్లయ్యిందనిపిస్తారు.

"ఇంద".

పెళ్లికొడుకు విసిరిన చిల్లర డబ్బులేరుకుని టెలిగ్రాఫిస్టు నిష్క్రమిస్తాడు.

ఎలక్ట్రిసిటీ వల్ల ఎవరికైనా కోపం వస్తుందా అంటే శాస్త్ర చర్చల వల్ల కూడా కొన్నిసార్లు మనస్తాపం కలుగుతుంది మరి.

భోజనాలయ్యాయి. చీకటి వడింది. రచయిత తన ఊహాసక్తికి కళ్లెం వేసి, ఎప్పుడు తెల్లవారుతుందా అని నిరీక్షిస్తున్నప్పుడు ప్రారంభమవుతుంది.

***

ఉదయం. ఇంకా ఎనిమిదన్నా కాలేదు. పెళ్లింట్లో అరుపులు, శోకాలు. వీధిలోకి ఇరుగు పొరుగులంతా తలలు రిక్కించి మరీ తమాషా చూస్తున్నారు.

"ఏమైంది?"

"మగపెళ్లివాళ్లక్కోవం రాదా మరి. వెయ్యి రూబుళ్లిస్తామని ఒప్పుకొనీ తొమ్మిదొందలే ఇచ్చారట.

"అయితే?"

ఇంతన్యాయం జరిగింతర్వాత పెళ్లికొడుకూరుకుంటాడా? మెత్తటి ఈకల వరువు చింపేశాడు. అదిగో, ఇంటినిండా, వీధినిండా ఎగురుతున్న తెల్లటి ఈకలు.

పెళ్లికొడుకు కోపాన్ని అదుపులో పెట్టడానికి ఇద్దరు పోలీసులు కావలసి వచ్చింది.

"వదండి. స్టేషనుకు. నేనేం చేశానని. నన్ను మోసం చేస్తే చూస్తూ వూర్కోవాలా ఏమిటి?" అంటూ పోలీసుల వెంట నడుస్తున్నాడు పెళ్లికొడుకు.

ఆ వెనక నెత్తీ నోరూ కొట్టుకుంటూ నడుస్తున్నారు పెళ్లికూతురూ, ఆమె తల్లీ.

"ఎందుకేడుస్తున్నావు పిల్లా?" అంటూ అడిగిందో ముసలావిడ పెళ్లికూతుర్ని.

"వీడి చేతులు వడిపోను. మూడు కిలోల ఈకల్తో కుట్టిన వరువు. ఈకలన్నీ వీధిపాలాయే. అంతా మారాత!" అంటూ ముక్కు చీదుకుంది పెళ్లికూతురి తల్లి.

పెళ్లీ వాళ్లంతా వెళ్లిపోయాక వీధి సర్దుమణిగింది. సాయంత్రం దాకా ఆ ప్రశాంతతకు భగ్నం లేదు. ■

## "నేవీలో చేరాలనుకున్నా!

...కానీ నటుణ్నయిపోయా!" అంటున్నాడు 'అక్కీ'గా జనమంతా పిలుచుకునే అక్షయ్‌కుమార్. పెళ్లయాక యాక్షన్ చిత్రాలు తగ్గించి ఫామిలీ కథల్లో చేస్తున్నాడు అక్కీ. పన్నెండు చిత్రాల్లో పోలీస్ ఆఫీసర్‌గా చేసి బోరనిపించి వచ్చిన అవకాశాలు వద్దన్నాట్ట.



రవీనాటండన్‌తో ఇప్పుడు 'విరోధ్' చిత్రంలో చేస్తున్నాడు. "నేను మామూలు మనిషినండీ! ప్రపంచంలో ఎవరికి ఎవరితో సంబంధాలున్నా పట్టించుకోని జనం. సినిమాతారల గురించి మాత్రం ఏం తెలిసినా పేపర్ల కెక్కించేస్తుంటారు. ఎవరేమన్నా నేనేమీ అనను. నా మీద దాడి చేస్తే మాత్రం నేనూరుకోను!" అంటున్నాడు అక్కీ. ఓ సారి శక్తికపూర్‌ను విరగదీశాడని జనం చెప్పుకుంటారు మరి!